TG/TEL/25/A3731

# నిజం
దృష్టి తెలుగు న్యూస్

హైదరాబాద్ ఎడిటర్: వరుదు సుజాత సంపుటి:-1 సంచిక:-193 పేజీలు:-4 శుక్రవారం 26-06-2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354

## రియల్ ఎస్టేట్‌ను బొంద పెట్టింది రేవంత్ ప్రభుత్వమే



- రూ.కోటి విలువ భూములు ఇప్పుడు రూ.60 లక్షలకు కూడా అమ్ముడవడం లేదని వ్యాఖ్య
- కేసీఆర్ హయాంలో పరిశ్రమలతో భూముల విలువలు పెరిగాయని వెల్లడి
- ఎన్నికల హామీలను కాంగ్రెస్ అమలు చేయలేదని ఆరోపణ
- రైతు బంధు, దళిత బంధు అంశాల్లో ప్రజలను మోసం చేశారని విమర్శ
- 2028లో కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని కార్యకర్తలకు పిలుపు

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని - మిగతా 2 లో

## మూడు రాష్ట్రాల రైతులకు కొత్త ఆశ

తుంగభద్ర వద్ద రేవంత్ కీలక సందేశం

- తుంగభద్ర నూతన క్రస్ట్ గేట్ల ప్రారంభం
- చరిత్రలో నిలిచే ఘట్టమన్న రేవంత్
- మూడు రాష్ట్రాల రైతులకు ప్రయోజనమని స్పష్టీకరణ
- జల వివాదాలకు పరిష్కారం కావాలని ఆకాంక్ష
- కృష్ణా-గోదావరి సమస్యల పరిష్కారమవుతాయని ఆశాభావం



2లో

తుంగభద్ర డ్యామ్ క్రస్ట్ గేట్ల పునరుద్ధరణ దక్షిణ భారత జలవనరుల చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా నిలుస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కర్ణాటకలోని మునీరాబాద్‌లో నూతన

## రిటైర్మెంట్ తర్వాత సీఎస్‌కు కీలక పదవి

'ఇన్వెస్ట్ తెలంగాణ' ఎండీగా నియామకం?



- తెలంగాణలో 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో కొత్త ఏజెన్సీ ఏర్పాటు
- రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే ప్రధాన లక్ష్యం
- ఏజెన్సీ ఎండీగా రామకృష్ణారావు నియమితులయ్యే అవకాశం
- పదవీ విరమణ తర్వాత ఆయన సేవలను వినియోగించుకోవాలని సర్కార్ యోచన
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ ఏజెన్సీని ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం

రాష్ట్రానికి జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను భారీ స్థాయిలో ఆకర్షించడమే తెలంగాణ - మిగతా 2 లో

## అయోధ్య రామమందిరంలో నిధుల గోల్‌మాల్

8 మందిపై కేసు, ఆరుగురు అరెస్ట్!


- అయోధ్య రామమందిర విరాళాల్లో భారీ అవకతవకలు
- హుండీ సొమ్ము కాజేసిన 8 మంది సిబ్బందిపై ఎఫ్ఐఆర్
- ఇప్పటికే ఆరుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు
- సుమారు రూ. 7.5 కోట్లు మాయమైనట్లు ప్రాథమిక అంచనా
- సిట్ నివేదిక ఆధారంగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ చర్యలు



దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం కేసులో ఉత్తరప్రదేశ్ పోలీసులు ఎనిమిది మందిపై - మిగతా 2 లో

## వెనిజులాలో భూకంప విలయం 164 మంది మృతి

- 971 మందికి పైగా గాయాలు
- 7.2, 7.5 తీవ్రతలతో వరుస ప్రకంపనలు
- లా గ్వైరా ప్రాంతంలో భారీ విధ్వంసం
- అనేక భవనాలు కూలిపోవడంతో సహాయక చర్యలు
- ప్రధాన విమానాశ్రయం, మెట్రో సేవలకు అంతరాయం
- పలు దేశాల నుంచి సహాయక బృందాల రాక



వరుస భూకంపాల ధాటికి వెనిజులాలో ఇప్పటి వరకు 164 మంది చనిపోయినట్లు గుర్తించారు. మరో 971 మంది తీవ్రంగా గాయపడ్డారు. భవనాల శిథిలాల కింద చాలా మంది చిక్కుకుపోయినట్లు అనుమానిస్తున్నారు. దీంతో మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. - మిగతా 2 లో

## ప్రధాని మోదీతో అమెజాన్ సీఈఓ భేటీ

భారత్‌లో రూ.లక్షల కోట్ల పెట్టుబడి ప్రకటన



- 2026-30 మధ్య భారత్‌లో 48 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టనున్న అమెజాన్
- ఏఐ, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విస్తరణకు అదనంగా 13 బిలియన్ డాలర్ల కేటాయింపు
- ముంబై, హైదరాబాద్‌లలో డేటా సెంటర్ల సామర్థ్యం పెంపునకు ప్రణాళిక
- ఉద్యోగాల కల్పన, ఎగుమతుల ప్రోత్సాహానికి పెద్దపీట వేయనున్నట్లు ఆండీ జెస్సీ వెల్లడి

ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్, భారత్‌లో తన వ్యాపార కార్యకలాపాలను భారీగా - మిగతా 2 లో

## 'ఎప్పటికీ క్షమించవద్దు ఎప్పటికీ మర్చిపోవద్దు'

మర్జెన్సీ ఒక ఘోర పాపం: ప్రధాని మోదీ

- ఎమర్జెన్సీకి 51 ఏళ్లు.. కాంగ్రెస్‌పై ప్రధాని విమర్శలు
- భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఎమర్జెన్సీ చీకటి అధ్యాయం అని వ్యాఖ్య
- ఎమర్జెన్సీ విధించిన వారిని ఎప్పటికీ క్షమించవద్దని ప్రజలకు పిలుపు
- ఆనాడు ప్రతిపక్ష నేతలను జైల్లో పెట్టారని, మీడియా గొంతు నొక్కారని ఆరోపణ
- ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా తాను కూడా పోరాడానని గుర్తు చేసుకున్న మోదీ



2లో

దేశంలో ఎమర్జెన్సీ విధించి 51 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే ఇది అత్యంత చీకటి అధ్యాయమని,

## నీ తండ్రి ఎక్కడ?



- అసెంబ్లీ వేదికగా ఉదయనిధిని ప్రశ్నించిన విజయ్.. షాకింగ్ సమాధానం చెప్పిన డీఎంకే!
- తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ మీ నాన్న ఎక్కడ?" అని చేసిన వ్యాఖ్య
- రాష్ట్ర రాజకీయాల్లో రాజుకున్న తీవ్ర వివాదం.. డీఎంకేలో పెరిగిన ఆవేశం
- ఉప ఎన్నికల ద్వారా స్టాలిన్‌ను సభకు తీసుకురావాలని డీఎంకేలో బలపడుతున్న వాదన
- మాటల యుద్ధం వ్యక్తిగత దూషణలకు దారితీయడంపై విమర్శలు

తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ అసెంబ్లీలో చేసిన 'మీ తండ్రి ఎక్కడ?' అనే - మిగతా 2 లో

## అధ్యాపక పోస్టుల భర్తీ వేగవంతం చేయండి

అధికారులకు మంత్రి లోకేష్ ఆదేశం



- నిరుద్యోగుల కోసం జూలైలో 'నైపుణ్యం' పోర్టల్ ఆవిష్కరణ
- అన్ని ప్రభుత్వ ఐటీఐలలో ఏఐ ల్యాబ్స్ ఏర్పాటుకు చర్యలు
- ప్రతి మూడు నెలలకు ఒకసారి నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు
- ఓంక్యాప్ ద్వారా వచ్చే నెలలో 146 మందికి విదేశీ ఉద్యోగాలు

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక పోస్టుల భర్తీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, - మిగతా 2 లో

## కూటమి పాలనలో డ్వాక్రా మహిళలకు అన్యాయం



- డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదని జగన్ ఆరోపణ
- రుణాలపై వడ్డీ రాయితీ హామీని విస్మరించడం వల్ల మహిళలకు రూ.6 వేల కోట్లు నష్టం
- వైసీపీ హయాంలో వడ్డీ రాయితీ కింద రూ.4,969 కోట్లు చెల్లించామని వెల్లడి
- ప్రస్తుత పథకాన్ని కూడా ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శ

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఏపీలోని - మిగతా 2 లో

## ప్రతి ఏటా లాగే ఈసారి కూడా దీక్ష చేపట్టిన పవన్

- మంగళగిరిలో వార్షిక ఆధ్యాత్మిక దీక్షను ప్రారంభించిన పవన్ కళ్యాణ్
- పానకాల లక్ష్మీనరసింహస్వామికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు
- ప్రతి ఏటా నాలుగు నెలల పాటు ఈ దీక్షను పాటిస్తున్న పవన్
- డిప్యూటీ సీఎంగా బాధ్యతలు నిర్వహిస్తూనే దీక్ష స్వీకరణ



2లో

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తన వార్షిక ఆధ్యాత్మిక దీక్షను ప్రారంభించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని శ్రీ పానకాల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిన్న ఆయన

## కూటమి పాలనలో డ్వాక్రా మహిళలకు అన్యాయం

మొదటిపేజీ తరువాయి – కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు గురువారం ట్విట్టర్ వేదికగా ఆయన స్పందించారు. డ్వాక్రా మహిళలకు రుణాలు అందిస్తే వారికి ఆర్థిక స్వావలంబన కలగడమే కాకుండా, ఉత్పాదక రంగాల్లో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉంటుందని జగన్ పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో స్వయం సహాయక గ్రూపు రుణాలపై వడ్డీ రాయితీ పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతామని హామీ ఇచ్చి, ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేతులెత్తేసిందని జగన్ విమర్శించారు. ఈ హామీని అమలు చేయకపోవడం వల్ల మహిళలు ఏటా రూ.3 వేల కోట్ల చొప్పున రెండేళ్లకు రూ.6 వేల కోట్ల ప్రయోజనాన్ని కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమ హయాంలో డ్వాక్రా మహిళలకు వడ్డీ రాయితీ కింద రూ.4,969 కోట్లు చెల్లించామని, ఆసరా, చేయూత వంటి పథకాల ద్వారా ఆర్థికంగా అండగా నిలిచామని జగన్ గుర్తుచేశారు. పెంచిన రుణ పరిమితి సంగతి అటుంచి, ప్రస్తుతం ఉన్న వడ్డీ రాయితీ పథకానికి కూడా మద్దతు ఇవ్వకుండా కూటమి సర్కార్ నిర్వీర్యం చేసిందని ఆయన మండిపడ్డారు.

## రియల్ ఎస్టేట్‌ను బొంద పెట్టింది రేవంత్ ప్రభుత్వమే

మొదటిపేజీ తరువాయి – బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల ముందు రియల్ ఎస్టేట్‌పై గొప్పలు చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత అదే రంగాన్ని పూర్తిగా దెబ్బతీశారని విమర్శించారు. చేవెళ్ల నియోజకవర్గంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికలకు ముందు రూ.కోటి పలికిన ఎకరం భూమి ప్రస్తుతం రూ.50–60 లక్షలకు కూడా కొనుగోలుదారులు దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. రియల్ ఎస్టేట్‌పై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది ఉపాధి కోల్పోయే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో చేవెళ్ల ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చామని కేటీఆర్ చెప్పారు. షాబాద్ పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసి మైక్రోసాఫ్ట్, అమెజాన్, వెల్‌స్పన్ వంటి అంతర్జాతీయ సంస్థలను తీసుకొచ్చామని చెప్పారు. పరిశ్రమల విస్తరణతో ఒకప్పుడు రూ.30 లక్షలు ఉన్న ఎకరం భూమి విలువ రూ.3 కోట్లకు చేరిందన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఎన్నికల హామీల్లో ఒక్కటి కూడా పూర్తిగా అమలు కాలేదని కేటీఆర్ విమర్శించారు. రైతు బంధు, దళిత బంధు, ఇందిరమ్మ ఇళ్లు, అసైన్డ్ భూముల పట్టాల అంశాల్లో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. గత ప్రభుత్వ అప్పులపై విమర్శలు చేసే కాంగ్రెస్ నేతలు తమ పాలనలో చేసిన అప్పుల లెక్కలు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసమే ఖర్చయ్యాయని చెప్పారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.


## మూడు రాష్ట్రాల రైతులకు కొత్త ఆశ

మొదటిపేజీ తరువాయి – క్రస్ట్ గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ఈ ప్రాజెక్టు మూడు రాష్ట్రాల రైతాంగ భవిష్యత్తుకు కొత్త ఆశలు నింపుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం గేట్ల పునరుద్ధరణను కేవలం ఇంజినీరింగ్ విజయంగా చూడలేమన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని కరవు ప్రభావిత ప్రాంతాలకు ఇది కీలక మైలురాయిగా మారుతుందని చెప్పారు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాలైన కర్నూలు, అనంతపురంతో పాటు తెలంగాణలోని పాలమూరు ప్రాంత ప్రజలు ఎదుర్కొన్న నీటి కష్టాలు తనకు బాగా తెలుసన్నారు. రాష్ట్రాల మధ్య నీటి పంపకాల అంశాలు సకాలంలో పరిష్కారం కాకపోవడం వల్ల విలువైన జలాలు సముద్రంలో కలిసిపోతున్నాయని రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలు, వివాదాలు పక్కనబెట్టి రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. తుంగభద్ర వేదికగా మూడు రాష్ట్రాల మధ్య జరుగుతున్న చర్చలు సానుకూల దిశగా సాగుతున్నాయని సీఎం తెలిపారు. ఇదే స్ఫూర్తితో కృష్ణా, గోదావరి నదీ జలాల పంపకాల సమస్యలకు కూడా శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణకు సంబంధించిన కీలక అంశాన్ని కూడా సీఎం ప్రస్తావించారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి చట్టబద్ధంగా రావాల్సిన 10 టీఎంసీల నీరు ఇప్పటికీ రాష్ట్రానికి పూర్తిగా అందడం లేదని పేర్కొన్నారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) పరిధిలోని తెలంగాణ రైతులకు న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో పొరుగు రాష్ట్రాలు సహకార భావంతో వ్యవహరించాలని కోరిన సీఎం, పరస్పర అవగాహనతో ముందుకు సాగితేనే మూడు రాష్ట్రాల రైతాంగానికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని స్పష్టం చేశారు.

## రిటైర్మెంట్ తర్వాత సీఎస్‌కు కీలక పదవి

మొదటిపేజీ తరువాయి – ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 'ఇన్వెస్ట్ తెలంగాణ' (×అజవర్ ౹వశ్రీఖఅస్త్రుఖఖ) పేరుతో ఒక ప్రత్యేక పెట్టుబడుల ప్రోత్సాహక సంస్థను ఏర్పాటు చేయనుంది. ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఈ సంస్థకు మేనేజింగ్ డైరెక్టర్‌గా (ఎండీ) నియమితులయ్యే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ నూతన ఏజెన్సీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ దాదాపు తుది దశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. పెట్టుబడిదారులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించడం, వివిధ ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేయడం, సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేయడం వంటివి ఈ ఏజెన్సీ ప్రధాన విధులుగా ఉండనున్నాయి. ముఖ్యంగా ఐటీ, ఫార్మా, లాజిస్టిక్స్, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (+జజ) వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఇందులో ఒక 'ఇన్వెస్ట్ సెల్'ను కూడా ఏర్పాటు చేయనున్నారు. గత మే నెలలో ఐటీ, పరిశ్రమల శాఖలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. పెట్టుబడుల ఆకర్షణలో దూకుడుగా వ్యవహరించేందుకు తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ఈ ఏజెన్సీకి ఒక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌తో పాటు, కీలక రంగాలకు వేర్వేరుగా డైరెక్టర్లను నియమించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. 1991 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన కె. రామకృష్ణారావు జూన్ 30న పదవీ విరమణ చేయనున్నారు. ఆర్థిక, పరిపాలనా రంగాల్లో ఆయనకు ఉన్న అపార అనుభవాన్ని వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే ఆయనకు ఎండీ బాధ్యతలతో పాటు, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సలహాదారుగా నియమించే అంశంపై కూడా కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం. c

## అయోధ్య రామమందిరంలో నిధుల గోల్‌మాల్



మొదటిపేజీ తరువాయి – ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అందజేసిన ఫిర్యాదు మేరకు గురువారం రామ్ జన్మభూమి పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు నమోదైంది. ట్రస్ట్ సభ్యుడు కృష్ణ మోహన్ ఫిర్యాదు ప్రకారం, ఆలయం విరాళాల పెట్టెల్లోని నగదును లెక్కించే సిబ్బంది కుట్రపూరితంగా నిధులను పక్కదారి పట్టించారు. సీసీటీవీ దృశ్యాలను పరిశీలించడంతో ఈ భారీ మోసం వెలుగులోకి వచ్చింది. నిందితుల్లో ఆలయ ఉద్యోగులైన అనుకల్ప్ మిశ్రా, లవకుశ్ మిశ్రా, అవినాశ్ శుక్లా తదితరులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు రూ. 7 కోట్ల నుంచి రూ. 7.5 కోట్ల మేర నిధులు అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. నిందితుల నుంచి పోలీసులు కొంత నగదును స్వాధీనం చేసుకున్నారు. విరాళాల నిర్వహణలో అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో, ఆలయ ట్రస్ట్ విజ్ఞప్తి మేరకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం జూన్ 13న ముగ్గురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. ఈ బృందం ఇటీవలే ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు తన ప్రాథమిక నివేదికను సమర్పించింది. ఆ నివేదికలోని ముఖ్యాంశాల ఆధారంగానే పోలీసులు తాజా చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ స్పందిస్తూ, భక్తుల నమ్మకాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం మహా పాపమని విమర్శించారు. కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ వంటి ఇతర విపక్షాలు ఈ కేసుపై పారదర్శక విచారణ జరపాలని, అవసరమైతే సీబీఐ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి. అయితే, దర్యాప్తు ప్రక్రియ కొనసాగుతున్నందున రాజకీయ నాయకులు అనవసర వ్యాఖ్యలు చేయవద్దని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ విజ్ఞప్తి చేశారు.

# అధ్యాపక పోస్టుల భర్తీ వేగవంతం చేయండి

మొదటిపేజీ తరువాయి – వేగవంతంగా పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1,523 అధ్యాపక పోస్టులకు గాను ఇప్పటివరకు 1,89,316 దరఖాస్తులు వచ్చాయని అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును డేటా ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. విశ్వవిద్యాలయాన్ని యూనిట్‌గా తీసుకుని నియామకాలు చేపడుతున్నందున, ఎంపిక కమిటీలకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని స్పష్టం చేశారు. వీలైనంత త్వరగా ఈ నియామక ప్రక్రియను ముగించాలని ఆదేశించారు. స్కిల్ యూనివర్సిటీల ఏర్పాటుకు సంబంధించి పరిశ్రమలతో తప్పనిసరిగా ఒప్పందాలు ఉండాలని, చట్టం దేశానికే ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత కోసం రూపొందించిన 'నైపుణ్యం' పోర్టల్‌ను వచ్చే నెలలో ఆవిష్కరించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. దీని ద్వారా నమోదైన ప్రతి ఒక్కరికీ ఆన్‌లైన్ స్కిల్ కార్డు జారీ చేస్తామని వెల్లడించారు. పీఎం సేతు పథకం కింద మంజూరైన క్లస్టర్లలో ఐటీఐలను బలోపేతం చేయాలని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో అన్ని ప్రభుత్వ ఐటీఐలలో ఏఐ ల్యాబ్స్‌లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కార్పొరేషన్ (ఓంక్యాప్) ఆధ్వర్యంలో వచ్చే నెలలో 146 మందికి విదేశీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు నిర్వహించిన జాబ్ మేళాల ద్వారా 1,30,422 మందికి ఉద్యోగాలు లభించాయని, ఇకపై ప్రతి త్రైమాసికానికి నియోజకవర్గ కేంద్రాల్లో జాబ్ మేళాలు నిర్వహించాలని లోకేష్ ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి శ్యామలరావు, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నారాయణ భరత్ గుప్త, స్కిల్ డెవలప్‌మెంట్ ఎండీ గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఏటా లాగే.. ఈసారి కూడా దీక్ష చేపట్టిన పవన్

మొదటిపేజీ తరువాయి – శాస్త్రోక్తంగా ఈ దీక్షను స్వీకరించారు. దీక్షా స్వీకరణకు ముందు పవన్ కల్యాణ్ ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి, అష్టోత్తర శతనామావళి పూజ జరిపించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు రాజగోపురం వద్ద ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) సునీల్ కుమార్, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. పవన్ కల్యాణ్ ప్రతి ఏటా నాలుగు నెలల పాటు ఈ దీక్షను పాటిస్తుంటారు. తన గురువు నుంచి మంత్రోపదేశం పొందిన నాటి నుంచి ఆధ్యాత్మిక క్రమశిక్షణలో భాగంగా ఈ నియమాన్ని ఆయన అనుసరిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రిగా, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తూనే ఆయన తన ఆధ్యాత్మిక నియమాలను కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావుతో పాటు పలువురు నేతలు, జనసేన నాయకులు పాల్గొన్నారు. పవన్ కల్యాణ్ ను కలిసిన రామ్ చరణ్... ఫొటోలు ఇవిగో! డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ భేటీ మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో సమావేశం మర్యాదపూర్వకంగా బాబాయ్ ను కలిసిన రామ్ చరణ్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్ కార్యక్రమం కోసం మంగళగిరికి వచ్చిన చరణ్ మెగా పవర్ స్టార్ రామ్ చరణ్.. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో భేటీ అయ్యారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఈ సమావేశం జరిగింది. పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రామ్ చరణ్ ఆయనను కలవడం ఇదే తొలిసారి. అమరావతిలోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరగనున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) వేడుకకు హాజరయ్యేందుకు రామ్ చరణ్ మంగళగిరి వచ్చారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన నేరుగా జనసేన పార్టీ కార్యాలయానికి వెళ్లి, తన బాబాయ్ పవన్ కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్‌కు రామ్ చరణ్ అభినందనలు తెలియజేశారు. అనంతరం వీరిద్దరూ కాసేపు ముచ్చటించారు. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించి, ప్రభుత్వంలో కీలక బాధ్యతలు చేపట్టిన పవన్ కల్యాణ్‌ను రామ్ చరణ్ కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ భేటీకి సంబంధించిన ఛాయాచిత్రాలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# వెనిజులాలో భూకంప విలయం 164 మంది మృతి

మొదటిపేజీ తరువాయి – గత వందేళ్లలో ఆ దేశాన్ని తాకిన అత్యంత శక్తిమంతమైన భూకంపాల్లో ఇవి ఒకటిగా నమోదయ్యాయి. రాజధాని కారకాస్‌తో పాటు పలు రాష్ట్రాల్లో తీవ్ర నష్టం సంభవించింది. ముఖ్యంగా లా గ్వైరా ప్రాంతం అత్యంత ప్రభావితమైంది. డజన్ల కొద్దీ భవనాలు నేలమట్టమవగా, శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు సహాయక బృందాలు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాయి. రాష్ట్ర టెలివిజన్ ప్రసారం చేసిన దృశ్యాల్లో శిథిలాల కింద చిక్కుకున్న ముగ్గురు చిన్నారులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చిన ఘటన కనిపించింది. భూకంపాల సమయంలో కారకాస్‌లో భవనాలు ఊగిపోవడంతో ప్రజలు భయంతో రోడ్లపైకి పరుగులు తీశారు. పలుచోట్ల విద్యుత్, మొబైల్ సేవలు నిలిచిపోయాయి. ప్రధాన అంతర్జాతీయ విమానాశ్రయానికి కూడా నష్టం వాటిల్లడంతో విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మెట్రో సేవలను నిలిపివేయగా, పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. అమెరికా భూకంప పరిశోధనా సంస్థ తెలిపిన వివరాల ప్రకారం మొదటి భూకంపం కారకాస్‌కు పశ్చిమాన ఉన్న మోరాన్ సమీపంలో సంభవించగా, కేవలం నిమిషం వ్యవధిలోనే మరో భారీ భూకంపం నమోదైంది. ఈ ప్రకంపనలు బ్రెజిల్, కొలంబియా వరకు అనిపించాయి. విపత్తు తీవ్రత దృష్ట్యా అమెరికా, మెక్సికో, ఖతార్, ఎల్‌సాల్వడార్ సహా పలు దేశాలు సహాయక బృందాలు, వైద్య సాయం పంపుతున్నాయి. ప్రభుత్వం అత్యవసర పరిస్థితిని ప్రకటించి సహాయక చర్యలను ముమ్మరం చేసింది.

# ప్రధాని మోదీతో అమెజాన్ సీఈఓ భేటీ

మొదటిపేజీ తరువాయి – విస్తరించేందుకు సిద్ధమైంది. ప్రధాని నరేంద్ర మోదీతో కంపెనీ సీఈఓ ఆండీ జెస్సీ సమావేశమైన అనంతరం ఈ కీలక ప్రకటన వెలువడింది. 2026 నుంచి 2030 మధ్య కాలంలో దేశంలో ఏకంగా 48 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 4.53 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్లు అమెజాన్ ప్రకటించింది. ఈ పెట్టుబడులతో భారత మార్కెట్‌పై తమకున్న దీర్ఘకాలిక నిబద్ధతను కంపెనీ మరోసారి స్పష్టం చేసింది. భారత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను విస్తరించడానికి 2030 నాటికి అదనంగా 13 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు ఆండీ జెస్సీ తెలిపారు. దీంతో కేవలం ఏఐ, క్లౌడ్ రంగంలోనే అమెజాన్ మొత్తం పెట్టుబడి 21 బిలియన్ డాలర్లను దాటనుంది. ఈ పెట్టుబడుల ద్వారా ముంబై, హైదరాబాద్‌లలోని అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) డేటా సెంటర్ల సామర్థ్యాన్ని గణనీయంగా పెంచనున్నారు. ఇది స్టార్టప్‌లు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ ఏజెన్సీలకు కస్టమ్ ఏఐ చిప్స్, సురక్షిత క్లౌడ్ టెక్నాలజీలు, డెవలపర్ టూల్స్‌ను అందుబాటులోకి తెస్తుంది. తద్వారా ఆవిష్కరణలను వేగవంతం చేయవచ్చని కంపెనీ పేర్కొంది. ఈ సమావేశం అనంతరం ఆండీ జెస్సీ మాట్లాడుతూ.. "దశాబ్దం క్రితం భారత్‌లోకి అడుగుపెట్టాం. అప్పటి నుంచి ఈ-కామర్స్, ఏఐ, క్లౌడ్ వ్యాపారాల్లో అద్భుతమైన వృద్ధిని చూస్తున్నాం. ద ప్రధాని మోదీ దార్శనికత అయిన 'వికసిత్ భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాల సాధనకు కట్టుబడి ఉన్నాం. భారత్ వృద్ధి ప్రస్థానంలో దీర్ఘకాలిక భాగస్వామిగా కొనసాగుతాం" అని స్పష్టం చేశారు. ఈ కొత్త పెట్టుబడులతో కలిపి 2010 నుంచి 2030 వరకు భారత్‌లో అమెజాన్ పెట్టిన మొత్తం పెట్టుబడుల విలువ 88 బిలియన్ డాలర్లకు పైగా చేరుకుంటుంది. గత కొన్నేళ్లుగా భారత్‌లో 12 మిలియన్ల చిన్న వ్యాపారాలను డిజిటలైజ్ చేశామని, 20 బిలియన్ డాలర్ల విలువైన ఈ-కామర్స్ ఎగుమతులను సాధ్యం చేశామని, ప్రత్యక్షంగా, పరోక్షంగా 2.8 మిలియన్ల ఉద్యోగాలకు మద్దతు ఇచ్చామని కంపెనీ వివరించింది. అలాగే, 10 మిలియన్ల భారతీయులకు క్లౌడ్ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చినట్లు తెలిపింది. భవిష్యత్తులోనూ భారత ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా ఏఐ ఆధారిత డిజిటలైజేషన్, ఎగుమతుల వృద్ధి, ఉద్యోగాల కల్పనపై దృష్టి సారిస్తామని అమెజాన్ పేర్కొంది. రానున్న కాలంలో 3.8 మిలియన్ల ఉద్యోగాలకు మద్దతు ఇవ్వడం, 80 బిలియన్ డాలర్ల సంచిత ఎగుమతులు సాధించడం, 15 మిలియన్ల చిన్న వ్యాపారాలకు ఏఐ ప్రయోజనాలు అందించడం, 4 మిలియన్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏఐ విద్యను అందించడం వంటి లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు వెల్లడించింది.

## 'ఎప్పటికీ క్షమించవద్దు ఎప్పటికీ మర్చిపోవద్దు'

మొదటిపేజీ తరువాయి – కాంగ్రెస్ చేసిన ఘోరమైన పాపమని అభివర్ణించారు. ఎమర్జెన్సీని విధించిన వారిని దేశ ప్రజలు 'ఎప్పటికీ క్షమించవద్దు.. ఎప్పటికీ మర్చిపోవద్దు' అని ఆయన పిలుపునిచ్చారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రధాని మోదీ ఒక సుదీర్ఘ పోస్ట్ చేశారు. 'ఎమర్జెన్సీ 51వ వార్షికోత్సవం – భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఎంతటి చీకటి అధ్యాయమో తెలుసుకోండి' అనే శీర్షికతో ఆనాటి పరిస్థితులను వివరించారు. "ఎమర్జెన్సీ కాలంలో పౌరుల హక్కులను, మీడియా స్వేచ్ఛను దారుణంగా అణచివేశారు. ప్రతిపక్ష నాయకులందరినీ అరెస్టు చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పిన వారిని, రాజకీయ అసమ్మతి తెలిపిన వారిని తీవ్రంగా అణచివేశారు. రచయితలు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులతో పాటు సామాన్య పౌరులను కూడా జైళ్లలో పెట్టి చిత్రహింసలకు గురిచేశారు" అని మోదీ ఆరోపించారు. ఆనాడు రాజ్యాంగాన్ని కాలరాశారని, న్యాయవ్యవస్థను రాజకీయ నియంత్రణలోకి తెచ్చేందుకు నీచమైన ప్రయత్నాలు జరిగాయని మోదీ విమర్శించారు. "మీడియాపై తీవ్రమైన ఆంక్షలు విధించారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించని వారిని బెదిరించారు లేదా పత్రికలను మూసివేశారు. ప్రాథమిక హక్కులను సస్పెండ్ చేశారు. పౌరులను రక్షించాల్సిన ప్రతి వ్యవస్థ వారికే వ్యతిరేకంగా మారింది. పార్లమెంటును కేవలం ఒక 'రబ్బరు స్టాంపు'గా మార్చేశారు" అని ఆయన పేర్కొన్నారు. అంతటి నిర్బంధం మధ్య కూడా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎందరో పోరాడారని మోదీ గుర్తుచేశారు. "వివిధ నేపథ్యాలు, సిద్ధాంతాలకు చెందిన ప్రజలందరూ ఏకమై ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు ముందుకు వచ్చారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా జరిగిన ఆ ఉద్యమంలో పాలుపంచుకునే గౌరవం నాకు కూడా దక్కింది" అని ఆయన తెలిపారు. ప్రజల పోరాట స్ఫూర్తి (జనశక్తి) ముందు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం తలవంచక తప్పలేదని, చివరికి ఎమర్జెన్సీని ఎత్తివేసి ఎన్నికలు నిర్వహించగా, దానిని విధించిన వారు ఘోరంగా ఓడిపోయారని వివరించారు. "ఎమర్జెన్సీ అనే ఘోర పాపం దానిని విధించిన వారి నుదుట శాశ్వతంగా నిలిచిపోతుంది. ఆనాడు ప్రజాస్వామ్యం కోసం దృఢంగా నిలబడిన ప్రతి ఒక్కరికీ ఈరోజు మనం వందనం చేస్తున్నాం. వారి వల్లే ప్రజాస్వామ్యం బతికింది" అని మోదీ పేర్కొన్నారు.

## హోసపేటలో అరుదైన దృశ్యం.. ఒకే వేదికపై చంద్రబాబు, రేవంత్, డీకే శివకుమార్

**హోసపేటలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవం**

**హాజరైన ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి**

**పాల్గొన్న కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేంద్రమంత్రి సీఆర్ పాటిల్**

**2024 వరదల్లో దెబ్బతిన్న గేట్ల స్థానంలో రూ.51 కోట్లతో నూతన నిర్మాణం**


**ప్రారంభోత్సవానికి ముందు మర్యాదపూర్వకంగా సమావేశమైన నేతలు**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కర్ణాటకలోని హోసపేటకు చేరుకున్నారు. తుంగభద్ర ప్రాజెక్టుకు రూ.51 కోట్ల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముందు హోసపేటలోని ఐఆర్‌బీ అతిథి గృహంలో చంద్రబాబు, రేవంత్ రెడ్డి, డీకే శివకుమార్, సీఆర్ పాటిల్ మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో ఏపీ మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు కూడా పాల్గొన్నారు. అనంతరం నేతలందరూ కలిసి ప్రాజెక్టు కొత్త గేట్లను లాంఛనంగా ప్రారంభించనున్నారు. 2024లో వచ్చిన భారీ వరదలకు తుంగభద్ర డ్యామ్ 19వ నంబర్ గేటు కొట్టుకుపోయింది. అప్పట్లో ప్రత్యామ్నాయంగా స్టాప్ లాక్ గేటును అమర్చారు. అయితే, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సూచనల మేరకు శాశ్వత పరిష్కారంగా కొత్త గేట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనికి అయిన రూ.51 కోట్ల వ్యయాన్ని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా భరించాయి. ఈ గేట్ల ప్రారంభం అనంతరం జరగనున్న బహిరంగ సభలో నేతలు ప్రసంగించనున్నారు.

# నీ తండ్రి ఎక్కడ?

మొదటిపేజీ తరువాయి – పదునైన వ్యాఖ్య రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ ఒక్క వ్యాఖ్యతో డీఎంకే శ్రేణుల్లో కొత్త ఆవేశం పెల్లుబుకగా, మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌ను తిరిగి శాసనసభకు తీసుకురావాలనే డిమాండ్లు బహిరంగంగా వినిపిస్తున్నాయి. త్వరలో జరగనున్న ఉప ఎన్నికల ద్వారా ఆయన రీఎంట్రీకి రంగం సిద్ధమవుతోందన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేను నడిపించిన ఎంకే స్టాలిన్, తన సొంత నియోజకవర్గం కొలత్తూరులో టీవీకే అభ్యర్థి చేతిలో అనూహ్యంగా ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి ఆయన అసెంబ్లీకి దూరంగా ఉంటుండగా, ఆయన కుమారుడు ఉదయనిధి స్టాలిన్ ప్రతిపక్ష నేతగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో సీఎం విజయ్ మాట్లాడుతూ ఒక కథ చెబుతూ 'మీ నాన్న ఎక్కడ?' అని ప్రశ్నించారు. ఇది ఉదయనిధిని, సభలో లేని ఆయన తండ్రి స్టాలిన్‌ను ఉద్దేశించి చేసిన పరోక్ష విమర్శగా అందరూ భావించారు. ఈ వ్యాఖ్యలపై స్టాలిన్ స్పందిస్తూ, "నేను ప్రజల హృదయాల్లో ఉన్నాను. అసెంబ్లీలో లేకపోవచ్చు, కానీ ప్రజలు నన్ను ఎక్కడ వెతికితే అక్కడ ఉంటాను" అని బదులిచ్చారు. అయితే, డీఎంకే సీనియర్ నేత, ఎమ్మెల్యే కేఎన్ నెహ్రూ మరింత ఘాటుగా స్పందించారు. "మా నాయకుడిని, మీ నాన్న ఎక్కడ అని అడిగారు కదా? ఆయన వస్తారు. అతి త్వరలోనే వస్తారు. తిరిగి బాధ్యతలు స్వీకరిస్తారు. కానీ ఈ వ్యాఖ్య తర్వాత తమిళనాడు వ్యాప్తంగా ఉన్న కార్యకర్తలు ఆయన రావాలని కోరుకుంటున్నారు" అని అన్నారు. ఈ వ్యాఖ్యలతో స్టాలిన్ పునరాగమనాన్ని పార్టీ ఎంత బలంగా కోరుకుంటుందో స్పష్టమైంది. మరోవైపు సీఎం విజయ్ వ్యాఖ్యలపై ఆయన కూటమిలోని భాగస్వామ్య పక్షాల నుంచి కూడా విమర్శలు వచ్చాయి. వీసీకే అధినేత థోల్ తిరుమావళవన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి హోదాకు ఇటువంటి వ్యాఖ్యలు తగవని, సభా గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత సీఎంపై ఉందని హితవు పలికారు. ఈ రాజకీయ మాటల యుద్ధం కాస్తా వ్యక్తిగత దూషణల స్థాయికి చేరింది. ఉదయనిధి స్టాలిన్ తన 'ఎక్స్' ఖాతాలో "చెంగల్పట్టు కోర్టులో భర్త కోసం వెతుకుతున్న భార్య" అంటూ చేసిన పోస్ట్, విజయ్ వ్యక్తిగత జీవితంలోని వివాదాలను ఉద్దేశించినదేనని భావిస్తున్నారు. ఇరుపక్షాల నేతలు వ్యక్తిగత జీవితాలను రాజకీయాల్లోకి లాగడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 6 అసెంబ్లీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. తాను గెలిచిన రెండు స్థానాల్లో ఒకటైన తిరుచ్చి ఈస్ట్ స్థానానికి విజయ్ రాజీనామా చేయగా, ఐదుగురు ఏఐఏడీఎంకే ఎమ్మెల్యేలు రాజీనామా చేసి టీవీకేలో చేరారు. ఈ స్థానాలకు జరగనున్న ఉప ఎన్నికలు విజయ్ ప్రభుత్వానికి తొలి ప్రధాన అగ్నిపరీక్షగా నిలవనున్నాయి. ఇదే అదనుగా తమ అగ్రనేత స్టాలిన్‌ను తిరిగి సభకు పంపించి, ప్రభుత్వానికి గట్టి పోటీ ఇవ్వాలని డీఎంకే భావిస్తోంది. స్టాలిన్ పోటీపై అధికారికంగా ఎలాంటి ప్రకటన రానప్పటికీ, డీఎంకేలో మాత్రం ఆయన రావాలన్న డిమాండ్ రోజురోజుకూ బలపడుతోంది. సీఎం విజయ్ వ్యాఖ్యే ఇందుకు ఆజ్యం పోసినట్లయింది.

## ప్రజా రాజధానిలో బాలకృష్ణ కొత్త సినిమా.. క్లాప్ కొట్టిన మంత్రి లోకేశ్



ప్రజా రాజధాని అమరావతిలో సినీ సందడి నెలకొంది. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటిస్తున్న 112వ చిత్రం నేడు వెలగపూడిలో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరై ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. బాలకృష్ణ కుమార్తె తేజస్విని కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా ఏపీలో సినీ పరిశ్రమను పెద్దఎత్తున ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు. సినిమాతో పాటు క్రియేటర్ ఎకానమీని కూడా అభివృద్ధి చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. అమరావతిలో సినిమా ప్రారంభోత్సవం జరగడం అదృష్టంగా భావిస్తున్నాం. భవిష్యత్తులో మరిన్ని సినిమాలు ఇక్కడి నుంచే ప్రారంభం కావాలని కోరుకుంటున్నా" అని అన్నారు. ఈ అవకాశం ఇచ్చినందుకు 'ముద్దుల మావయ్య జై బాలయ్య'కు ధన్యవాదాలు తెలిపారు. ఈ వేడుకలో సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్, దర్శకుడు కొరటాల శివ, నిర్మాతలు దగ్గుబాటి సురేశ్, చెరుకూరి సుధాకర్, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్, ఎంఎస్ రాజు తదితర సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. ప్రజా రాజధానిలో భారీ సినిమా ప్రారంభోత్సవం జరగడం ఇదే తొలిసారి.

# ప్రజాపాలనలో పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

**ఏరుగట్లమండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెల్లడి...**



మెండోరా మండల **జూన్ 25 నిజం న్యూస్:** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మండల కేంద్రమైన ఏర్గట్ల గ్రామంలో ముగ్గురు లబ్ధిదారులకు 67,500 రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం రోజున ఎర్ర గట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేండ్ల రాజారెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకుల చేతుల మీదుగా లబ్ధిదారులకు సీఎంఆర్ ఎఫ్. చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షల కు పెంచడం జరిగిందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా విద్య, వైద్యంపై దృష్టి సాధించడమే కాకుండా, గ్రామీణ ప్రాంతాలలో గల ఆరోగ్య ఉప కేంద్రాలలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో, వైద్యులను, సిబ్బందిని నియమించడమే కాకుండా, అవసరమయ్యే మందులను సైతం పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచుతుందన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో అధిక ప్రాధాన్యతను ఇచ్చి విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ఎంతో కృషి చేస్తుందన్నారు. ఏరుగట్ల గ్రామానికి సంబంధించి ఇప్పటివరకు 120 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందించడం జరిగిందన్నారు. అంతేకాకుండా మరో 80 మంది లబ్ధిదారులకు త్వరితగతిన నిధులు మంజూరు కానున్నాయని, మంజూరు అయిన వెంటనే మిగతా లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందన్నారు. ప్రత్యేకంగా సీ.ఎం. ఆర్.ఎఫ్. లబ్ధిదారుల నిధుల మంజూరుకు పాల్గొన్న నియోజకవర్గ ఇన్చార్జి కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని, రాజకీయ పార్టీలకతీతంగా మంజూరు చేస్తున్నారని, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీకి కృషి చేస్తున్న ముత్యాల సునీల్ కుమార్ రెడ్డికి, గ్రామ, మండల లబ్ధిదారుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం జీవన్, ముస్కు మోహన్, పన్నాల నర్సారెడ్డి, మేకల సాయన్న, రాజారాం,దేవ్, దొబ్బల చిన్న లక్ష్మణ్, శివన్నోల్ల రాజు,దండేవోయిన సాయి, జంగాల గణేష్, ఎస్కే సలీం, దొబ్బల బొర్రన్న, ఇబ్రాయిపట్నం పెద్ద ముత్తెన్న, మునిమాణిక్యం అజయ్, కంచరి రవి, ఒర్సు రాములు, సుధానవేణి శ్రీనివాస్ గౌడ్, ఇందూరు పెద్ద సాయన్న, తుపాకుల సుదర్శన్ గౌడ్, లబ్ధిదారులు, తదితరులు, పాల్గొన్నారు.

# డ్రగ్స్ బారిన పడితే కుటుంబాలు బుగ్గిపాలు

**ఆర్మూర్ సబ్ జడ్జి శ్రీదేవి, సి.ఐ.లు, పలువురు న్యాయవాదులు వెల్లడి...**

**పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "సే నో టు డ్రగ్స్ - ఎస్ టు లైఫ్" ర్యాలీ, సదస్సు...**

**మళ్లీ పట్టుబడితే జీవిత ఖైదు లేదా ఉరిశిక్ష తప్పదు...**

**రాజకీయ నాయకులకు యువత దూరంగా ఉండాలి...**






ఆర్మూర్ మండల **జూన్ 25 నిజం న్యూస్:** విద్యార్థులు, యువకులు, మత్తు పానీయాలకు,మత్తు సేవించడం వల్ల వారి కుటుంబాల జీవితాలు బుగ్గి పాలు కావడమే కాకుండా, వారి కుటుంబాలు దీనావ స్థితికి చేరుతున్నాయని, యువకులు, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, ఉన్నత విద్య అభ్యసిస్తూ ముందుకు సాగాలని, ఆర్మూర్ సివిల్ జడ్జి శ్రీదేవి, ఆర్మూర్ సి.ఐ.లు, సత్యనారాయణ గౌడ్, జానారెడ్డి, ఆర్మూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కూదురుపాక ప్రవీణ్, పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ అన్నారు. గురువారం రోజున నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మత్తు పానీయాల, మాదకద్రవ్యాల నియంత్రణపై, విద్యార్థులతో, యువకులతో ఏర్పాటుచేసిన ర్యాలీకి ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రసంగించారు. డ్రగ్స్ మహమ్మారి యువత భవిష్యత్తును, వారి కుటుంబాలను అంధకారంలోకి నెట్టేస్తోందని, విద్యార్థులు, యువకులు డ్రగ్స్ వంటి మహమ్మారికి దూరంగా ఉంటూ, ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని పిలుపునిచ్చారు. యువత గత కొంతకాలంగా రాజకీయ నాయకుల అండదండలతో, వారి స్వలాభానికై పక్కదోవ పట్టిస్తూ, చెడు మార్గానికి కారణమవుతుందని, ఇప్పటికైనా యువత మేల్కొని రాజకీయ నాయకులకు దూరంగా ఉండి, తమ కుటుంబ క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని, ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా "సే నో టు డ్రగ్స్ - ఎస్ టు లైఫ్" అంటూ పట్టణంలో విద్యార్థులతో, యువకులతో, పోలీసులతో, పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ప్లే కార్డులు పట్టుకొని,భారీ ర్యాలీ, మానవహారం, నిర్వహించి ప్రతి ఒక్కరు ప్రతిజ్ఞ గావించారు. పోలీసులు చేపట్టిన ఈ కార్యక్రమానికి సివిల్ జడ్జి తో పాటు బార్ అసోసియేషన్ న్యాయవాదులు సైతం పాల్గొని అవగాహన కల్పించి పోలీసులు చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేలా కృషి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్మూర్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో డ్రగ్స్ మహమ్మారి యువతను ఏ విధంగా నిర్వీర్యం చేస్తోందోనని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాల బారిన పడటం వల్ల కేవలం విద్యార్థుల ఆరోగ్యం మాత్రమే కాకుండా, వారిని నమ్ముకున్న కుటుంబాలు రోడ్డున పడి తీవ్రంగా నష్టపోతాయన్నారు. యువత అంటేనే ఒక గొప్ప శక్తి అని, అయితే వయసు రీత్యా ఉండే అనుభవ రాహిత్యం వల్ల కొందరు తప్పుడు మార్గాల్లో ప్రయాణించి జీవితాలను పాడుచేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు కష్టపడి చదువుకుంటూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. దేశంలో మత్తు పదార్థాల నియంత్రణకు కఠినమైన ఎన్‌డిపిఎస్ చట్టం అమల్లో ఉందని సబ్ జడ్జి గుర్తుచేశారు. డ్రగ్స్ తయారు చేసినా, సరఫరా చేసినా, తమ వద్ద ఉంచుకున్నా లేదా వినియోగించినా చట్టప్రకారం కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు.డ్రగ్స్ పరిమాణాన్ని బట్టి ఆరు నెలల నుండి పది, ఇరవై సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు లక్ష నుండి రెండు లక్షల రూపాయల వరకు జరిమానా విధిస్తారు.ఒకవేళ ఇదే నేరంలో మళ్లీ పట్టుబడితే జీవిత ఖైదు లేదా ఉరిశిక్ష కూడా పడే అవకాశం ఉందని సివిల్ జడ్జి స్పష్టం చేశారు. చుట్టుపక్కల ఎవరైనా డ్రగ్స్ వంటి వ్యసనాలకు అలవాటు పడితే వారిని రక్షించేందుకు చైల్డ్ హెల్ప్‌లైన్ లేదా పోలీసులకు సమాచారం అందించాలని, ఇందుకోసం 112 నంబర్‌ను సంప్రదించవచ్చని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ రూరల్ సీఐ సత్యనారాయణ గౌడ్, ఆర్మూర్ తహసిల్దార్ సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కుదురుపాక ప్రవీణ్, వివిధ మండలాల అధికారులు, న్యాయవాదులు, పోలీస్ సిబ్బందితో పాటు స్థానిక పాఠశాలల, కళాశాలల విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.

# బీసీల సమస్యలకు పరిష్కారం చూపాలి.. బేరి రామచందర్ యాదవ్

**బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు కి వినతి పత్రం అందించిన బీసీ కుల సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్**



**నిజం న్యూస్ హైదరాబాద్, జూన్ 25:** తెలంగాణలోని బీసీ కులాల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ కోరారు. బీసీల డిమాండ్ల కోసం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు కి శేరిలింగంపల్లి నియోజకవర్గ కంటెస్టింగ్ అభ్యర్థి మారబోయిన రవి కుమార్ యాదవ్ కి ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆనంద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్ సమక్షంలో ఓబీసీ సమస్యల గురించి వినతి పత్రం సమర్పించారు. బీసీ కుల సంఘాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్, బీసీ నాయకులు. బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రగుండ్ల ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో మియాపూర్ ఓబీసీ మోర్చా సమావేశం మదినగూడ భూమి బ్యాంకెట్ హాల్లో నిర్వహించారు. ముఖ్యంగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉన్నందున 54 శాతం ఉన్న బీసీలకు న్యాయం చేయాలని పేద వర్గాలైన 132 బీసీ కులాలకు అన్ని విధాల సహాయ పడాలని విన్నవిస్తూ మెమొరాండం అందజేశారు.బీసీ కులాల్లో ఎక్కువగా పేదలు ఉన్నందున విద్యా, వైద్యంలాంటి అధిక ఖర్చులు భరించలేని పక్షంలో ఉన్న పేదలకు కేంద్ర ప్రభుత్వం కూడా బాధ్యత తీసుకొని విద్య కోసం ఎక్కువ బడ్జెట్ కేటాయించాలని కోరారు పేదల కోసం ముద్ర లోన్లు, సబ్సిడీ లోన్స్ మిగతా అన్ని సంక్షేమ పథకాలను తూచా తప్పకుండా అన్ని బీసీ కుల సంఘాలకు వర్తించే విధంగా వృత్తి ధర్మంగా 132 కులాలకు సహాయం చేయాలని కోరారు రైతుల్లో 50 శాతం కంటే ఎక్కువ ఉన్న బీసీలు చాలామంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. బ్యాంకు లోన్ ఇవ్వనందున ఎంతో మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు రైతులకు సబ్సిడీ ఎరువులు సబ్సిడీ విత్తనాలు అవన్నీ కూడా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రైతులకు సహాయపడాలని విన్నవించారు ప్రజాస్వామ్యంలో చేతినిండా పని, కడుపునిండా అన్నం ఉండాల్సిందే. గ్రామీణ ప్రాంతాల్లో రోజుగార్ యోజన గ్రామీణ సడక్ యోజన ఎన్ని యోజనాలు ఉన్నా కూడా పేదరికానికి తొలగించే విధంగా ప్రభుత్వాలు ఇంతవరకు ప్రయత్నం చేయలేదన్నారు బీసీ కులాల బిసి సంఘాల ప్రధాన కార్యదర్శులు అధ్యక్షులు, బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ విజ్ఞప్తితో వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బేరి రామచంద్ర యాదవ్ తో పాటు ఆర్కే సాయన్న ముదిరాజ్ మేదరి సంఘం అధ్యక్షులు కొంటు ముకుందం బట్రాజు సంఘం అధ్యక్షులు రాజు విశ్వబ్రాహ్మణ సంఘం శేరిలింగంపల్లి శ్రీశైలం కురుమ, సాయిలు విశ్వకర్మ సంఘం హరికృష్ణ చారి ఐక్యవేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి కోటగిరి మారుతి అధ్యక్షులు కృష్ణమోహన్ యువత అధ్యక్షులు కొంటూ సుమన్ ఆంజనేయులు గౌడ సంఘం రామకృష్ణ గౌడ్ మున్నూరు కాపు సంఘం బి కృష్ణ నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సాయిలు, ముత్యం ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కంగ్టి మండలంలో ప్రారంభమైన SIR ప్రక్రియ

**పకడ్బందీగా నిర్వహించాలి**

**ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని**

**తహసీల్దార్ గంగా భవాని**



కంగ్టి **జూన్ 25 నిజం న్యూస్:** సంగారెడ్డి జిల్లాలోని నా రా య ం ణ ఖే డ్ నియోజకవర్గం కంగ్టి మండలంలో ప్రభుత్వం చేపట్టిన (ూ×=)ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ గురువారం నాడు జంగి కే జంగి బి గ్రామ పంచాయతీ లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గంగా భవాని మాట్లాడుతూ ప్రజలు ఓటర్ల జాబితా సవరణ చేసుకోవడం మరియు 18 సంవత్సరాలు నిండిన వారు కొత్త ఓటు నమోదు చేసుకోవడం మరణించిన వారి ఓట్లు తొలగించడం వంటివి చెయ్యడం జరుగుతుంది కాబట్టి ప్రజలు ఏనుమారెటర్లకు సహకరించి మీ యొక్క ఓట్లను సరి చేసుకోవాలని కోరారు. మార్పులు,చేర్పులు చేసుకోవచ్చని తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ దత్తురెడ్డి గ్రామపెద్దలు ఎన్నికల సిబ్బంది బి ఎల్ వో లు పాల్గొన్నారు.

# అండర్ డ్రైనేజి పనులు ప్రారంభించిన సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్

**నిధుల విడుదలకు కృషిచేసిన మాజీ ఎంపీటీసీ కి కృతజ్ఞతలు తెలిపిన గ్రామ ప్రజలు**



రాజాపేట, **జూన్ 25 నిజం న్యూస్:** రాజాపేట మండలం రఘునాథపురం గ్రామంలోనీ ఎస్సీ కాలనీలో మండల పరిషత్ 15 వ ఆర్థిక శాఖ యం.పి.టి.సి. నిధులు 4 లక్షల రూపాయలతో అండర్ డ్రైనేజీ పనులను గ్రామ సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కళ్యాణి రాజు, గ్రామపంచాయితి కార్యదర్శి సాగర్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు బింగి రమేష్, వార్డు సభ్యులు లక్ష్మీచంద్రశేఖర్, కటకం ప్రశాంత్,బల్ల హరీష్, వద్లకొండ మధు, ఉచేంతల స్వామి ,గువ్వల సిద్దులు దొంకేన భాస్కర్, తుంగ అక్షయ్, తుంగ సతీష్, కలకుట్ల కొమురయ్య, కలకుంట్ల కొమురయ్య, కొన్ని పోచయ్య, కటకంవెంకటేష్ కొండం రాజు,కలకుంట్ల ప్రశాంత్, కాలనీ వాసులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ నిధులు విడుదల చేయుటకు సహకరించిన మాజీ యం. పి.టి.సి. బుడిగే రేణుక పెంటయ్య గౌడ్ కి గ్రామ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ప్రభుత్వంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ 35.94% ఓట్లతో 36 సీట్లు సాధిస్తుందని రిపోర్ట్‌మంత్రులు పొన్నం




తెలంగాణ పబ్లిక్ పల్స్ 2026 రిపోర్ట్ **జూన్ 25 నిజం న్యూస్:** తెలంగాణలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,19,595 శాంపిల్స్‌తో రిపోర్ట్ తయారు చేసిన ఎవీ= సంస్థ ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికలు జరిగితే ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ 41.07% ఓట్లతో 70 సీట్లు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని.. ప్రభుత్వంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ 35.94% ఓట్లతో 36 సీట్లు సాధిస్తుందని రిపోర్ట్‌మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ ఓడిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రిపోర్ట్ ఇచ్చిన ఎవీ= సంస్థ

# ఘనంగా బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి జన్మదిన వేడుకలు







**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూన్ 25:** బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి తన కార్యాలయంలో ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకున్నాడు... ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కార్మికులు, అలాగే ఆటో కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు,నియోజకవర్గ నాయకులు, మీడియా మిత్రులు అధిక సంఖ్యలో పాల్గొని శాలువాతో సత్కరించి కేక్ కట్ చేసి కార్మికులు, మరియు మీడియా మిత్రులు, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు... స్థానిక కార్మికులు మాట్లాడుతూ నిత్యం ప్రజల్లో ఉండే కార్మిక నాయకుడు రవి ఎలప్పుడు కార్మికులకు కష్టమొచ్చిన నేనున్నా అంటూ ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేదాకా వురుకునే ప్రసక్తే లేదని ముందుండి మా కార్మికుల కుటుంబాలకు అండగా నిలుస్తున్న రవి కి మరొకసారి పుట్టినరోజు శుభాకాంక్షలు అని తెలిపారు.. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని కుటుంబ సభ్యులతో నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం అని తెలిపారు.. ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, మనోజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు...

# శ్రీ శ్రీ శ్రీ లీలాద్రి లక్ష్మీనరసింహస్వామి క్షేత్ర దేవస్థాన విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు



**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, జూన్ 25:** శేర్లింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని తులసీనగర్‌లో గల శ్రీశ్రీశ్రీ లీలాద్రి లక్ష్మీనరసింహస్వామి క్షేత్ర దేవస్థానంలో నిర్వహించిన సకల దైవ ప్రాణ ప్రతిష్ట, యంత్ర ప్రతిష్ట, శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి విగ్రహ ప్రతిష్ట, గజస్తంభ మహా ప్రతిష్ట కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ మహోన్నత ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఆలయ వ్యవస్థాపక చైర్మన్ మాధవరం కాంతారావు ఆహ్వానం మేరకు రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు హాజరై నిష్ఠతో పాల్గొన్నారు. ప్రతిష్టా కార్యక్రమం అనంతరం శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని తొలి దర్శనం చేసుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు.అనంతరం ఆలయ నిర్మాణం కార్యక్రమాల నిర్వహణ, భక్తులకు కల్పించిన సౌకర్యాల గురించి ఆలయ కమిటీ సభ్యులతో చర్చించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు ఏర్పాట్లు ఘనంగా నిర్వహించినందుకు ఆలయ నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన వడ్డేపల్లి రాజేశ్వరరావు కి ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ --- "శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కృపతో ఆలయ నిర్మాణం ఎంతో ప్రశాంతమైన వాతావరణంలో, భక్తి పరిమాణాలతో నిర్మించడం అభినందనీయం. ఇటువంటి ఆధ్యాత్మిక కేంద్రాలు ప్రజల్లో భక్తి భావాన్ని, ధార్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానంద నగర్ డివిజన్ మాజీ అధ్యక్షులు దానబోయిన నర్సింగ్ రావు, కూకట్ పల్లి డివిజన్ బిజెపి సీనియర్ నాయకులు దుర్గాప్రసాద్ రావు, శేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# హుడా కాలనీ లక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలలో పాల్గొన్న

**బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్**



**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, జూన్ 25:** హఫీజ్ పేట్ డివిజన్, హుడా కాలనీలోనీ లక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలలో ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు పాల్గొన్న....బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోరిన కోరికలు తీర్చే శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులకు, కాలనీ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు, లక్ష్మీ గణపతి స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నానన్నారు,ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి పద్మ, నాయకులు విష్ణు, శ్రీనివాస్ యాదవ్

# నీరు ఉంటేనే నాగరికత.. చరిత్ర: సీఎం చంద్రబాబు



**నిజం న్యూస్ ఆంధ్రప్రదేశ్, జూన్ 25:** కర్ణాటకలోని తుంగభద్ర జలాశయంలో 33 నూతన క్రస్ట్ గేట్లను గురువారం మునీరాబాద్ వద్ద జవీ చంద్రబాబు నాయుడు, జవీ రేవంత్ రెడ్డి, జవీ డి.కె. శివకుమార్ సంయుక్తంగా ప్రారంభించారు. గత ఏడాది వరదల వల్ల దెబ్బతిన్న గేట్ల స్థానంలో సుమారు రూ. 51 కోట్ల వ్యయంతో ఆరు నెలల రికార్డు సమయంలో ఈ గేట్లను అమర్చారు. ఈ సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. 'నీరు ఉంటేనే చరిత్ర.. నీరు ఉంటేనే నాగరికత' అని ఆయన పేర్కొన్నారు. అలాగే మూడు రాష్ట్రాల ఉమ్మడి ప్రయోజనార్థం ప్రాజెక్టును రికార్డు సమయంలో పూర్తి చేసినందుకు అందరినీ అభినందించారు.

# రోగులకు మెరుగైన సేవలే లక్ష్యంగా పని చెయ్యాలి



**నిజం న్యూస్ మచిలీపట్నం, జూన్ 25:** మచిలీపట్నం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో సేవల నాణ్యత పెంపు, పారదర్శక పరిపాలన, క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వైద్యులు, వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వహణ, పరిపాలనా విధానాలు, సమస్యలు, రోగులకు అందుతున్న సేవలపై చర్చించారు. సమస్యలను అధికారిక మార్గాల ద్వారా పరిష్కరించుకోవాలని, ప్రతి ఫైలు ఈ–ఆఫీస్ ద్వారానే నిర్వహించాలని, మాన్యువల్ ఫైళ్లకు ఆస్కారం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ రోగులకు ఉత్తమ సేవలు అందించేందుకు సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో ఎవరైనా ఇబ్బందులు ఎదుర్కొంటే నేరుగా తనను కలిసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, కొనుగోళ్ల ప్రక్రియలో జెమ్ (+శీజవతీఅఎవత్ వ మీుతీఎవె జూశ్రీుఎవ––+వవీ), ఈ–ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్స్ ద్వారానే వ్యవహరించాలని సూచించారు. నిబంధనల ఉల్లంఘనను ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది అందరూ ఒక జట్టుగా పనిచేస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కోరారు. ఆసుపత్రి అభివృద్ధి, సిబ్బంది సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి లీల ప్రసాద్, డాక్టర్ జి భానుమూర్తి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బోయిన వెంకట కృష్ణమరాజు, లింగం విజయ్, భూపతి త్రిపుర, విక్కుర్తి సాయిబాబు, ఎండి బాషి, ఇతర వైద్యులు, పరిపాలన విభాగం అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిజం
దృష్టి తెలుగు న్యూస్
శుక్రవారం 26-06-2026

## గ్యాస్ సిలిండర్లు వాడేవారికి కేంద్రం కొత్త రూల్స్ 30 రోజులు మాత్రమే టైమ్..



ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు వాడేవారికి కేంద్రం కొత్త రూల్స్ విధించింది. గతంలో ఉన్న నిబంధనలను సవరించింది. దీంతో గ్యాస్ వినియోగదారులకు మరింత ఊరట కలిగిస్తూ నిర్ణయం తీసుకుంది. తాజాగా గ్యాస్ సిలిండర్ల ధరలను కేంద్రం పెంచింది. ఈ క్రమంలో కొత్త రూల్స్ ఏంటో చూద్దాం. మీరు ఇంట్లో గ్యాస్ సిలిండర్ వాడుతున్నారా..? అయితే మీకో అలర్ట్. కేంద్ర ప్రభుత్వం పలు కొత్త నిబంధనలను తాజాగా అమల్లోకి తెచ్చింది. మీరు ఇంట్లో ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ వాడుతుంటే.. కొత్త రూల్స్ గురించి ఖచ్చితంగా తెలుసుకోవాల్సిందే. పైప్డ్ నేచురల్ గ్?్యస్(ాచీ+) కనెక్షన్ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లోని ప్రజలు తప్పనిసరిగా పీఎన్జీలోకి మారాలని, ఎల్పీజీ కనెక్షన్‌ను వదులుకోవాలని గతంలో కేంద్రం కండీషన్ విధించింది. గ్యాస్ ఏజెన్సీలు అలాంటివారి కనెక్షన్లను రద్దు చేయాలని కూడా సూచించింది. కొంతమంది పీఎన్జీతో పాటు ఎల్పీజీ సిలిండర్ల కనెక్షన్లు కూడా కలిగి ఉన్నారు. వీరి కనెక్షన్లను వెంటనే రద్దు చేయాలని ఆదేశించింది. ఇప్పుడు ఆ రూల్స్‌లో కేంద్రం పలు సందలింపులు ఇచ్చింది. అవేంటి అనేది ఇప్పుడు చూద్దాం.

**30 రోజుల డెడ్ లైన్**

మారిన సవరణల ప్రకారం.. మీరు ఒకవేళ ఎల్పీజీ కనెక్షన్ కలిగి ఉండి కొత్తగా పీఎన్జీ కనెక్షన్ తీసుకుంటే 30 రోజుల గడువు ఉంటుంది. 30 రోజుల్లోగా ఎల్పీజీ కనెక్షన్ సరెండర్ చేయాల్సి ఉంటుంది. అయితే మీరు ఆ తర్వాత మళ్లీ పీఎన్జీ సదుపాయాలు అందుబాటులో లేని ఏరియాలోకి మారినప్పుడు ట్రాన్స్‌ఫర్ వౌచర్ ఇస్తారు. దీని ద్వారా మీరు వెంటనే ఎల్పీజీ కనెక్షన్ పొందవచ్చు. ఈ మేరకు కొత్త నిబంధనలను కేంద్రం తీసుకొచ్చింది.

**పీఎన్జీ కనెక్షన్ వల్ల లాభాలు..?**

ఎల్పీజీ సిలిండర్ పదే పదే రీఫిల్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం ముందుగా బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత డెలివరీ కోసం ఎదురుచూడాల్సి ఉంటుంది. డెలివరీ బాయ్ వచ్చినప్పుడు ఇంటి దగ్గర లేకపోతే ఇబ్బంది అవుతుంది. అంతేకాకుండా గ్యాస్ డెలివరీకి వారం రోజుల సమయం పడుతుంది. కానీ పీఎన్జీ కనెక్షన్ తీసుకోవడం వల్ల అలాంటి ఇబ్బంది ఉండదు. నిరంతరం గ్యాస్ అందుబాటులో ఉంటుంది ఇక ఎల్పీజీ సిలిండర్లలో గ్యాస్ నిండుగా నింపారా లేదా అనే అనుమానం ఉంటుంది. చెక్ చేసుకోవడం అనేది శ్రమతో కూడుకున్న పని. అదే పీఎన్జీలో ఆ సమస్య ఉండదు ఇక పీఎన్జీ కనెక్షన్ తీసుకుంటే ముందుగానే డబ్బులు చెల్లించాల్సిన అవసరం ఉండదు. మీటర్ ప్రకారం బిల్లింగ్ జరుగుతుంది. అంటే మీరు వాడుకున్న గ్యాస్‌కు అనుగుణంగా బిల్ వేస్తారు. దీని వల్ల గ్యాస్ దొంగతనానికి ఆస్కారం అనేది ఉండదు. ప్రతీ రెండు నెలలకు ఒకసారి డబ్బులు చెల్లించే సౌకర్యం ఉంది. ఇక పీఎన్జీ వాడితే మసి, బూడిద, జిడ్డు మరకలు వంటి సమస్యలు కూడా ఉండవు. అలాగే పీఎన్జీ అనేది అత్యంత సురక్షితమైనది. లీకేజీ జరిగినప్పుడు పెద్దగా ప్రమాదం ఉండదు. వెంటిలేషన్ ఉంటే పలుచటి గాలిలో కలిసిపోతుంది. అదే ఎల్పీజీ బరువుగా ఉండటం వల్ల నేత ఉపరితలం వద్ద పేరుకుపోతుంది.

## తెలంగాణకు కేంద్రం భారీ శుభవార్త రాష్ట్రంలో మెగా రైల్వే కారిడార్ గ్రీన్ సిగ్నల్ వచ్చేసింది..



తెలంగాణకు మరో శుభవార్త. రాష్ట్రంలో మరో కొత్త రైల్వే లైన్ పట్టాలెక్కనుంది. ఈ మేరకు డీపీఆర్ ఆమోదం కోసం కేంద్రానికి పంపారు. గ్రీన్ సిగ్నల్ లభించాక పనులు మొదలుకానున్నాయి. ఐదేళ్లల్లో ఈ ప్రాజెక్ట్ పూర్తి చేయాలని రైల్వేశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. పూర్తి వివరాలు చూస్తే.. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. మరో మెగా కొత్త రైల్వే కారిడార్ ప్రకటించింది. రామగుండం-మనుగూరు మధ్య కొత్త రైల్వే లైన్ నిర్మించనుంది. ఈ మేరకు త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ఈ నూతన రైల్వే లైన్ 200 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంటుంది. దీని నిర్మాణానికి దాదాపు రూ.5 వేల కోట్లు అవసరమవుతాయని రైల్వేశాఖ అంచనా వేసింది. బొగ్గు, సిమెంట్, ఖనిజాలు, ఇతర లోహాలతో పాటు ఆహార ధాన్యాలు, కోక్ వంటి సరుకు రవాణాకూ ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని రైల్వేశాఖ అంచనా వేసింది. ఇది పూర్తై అందుబాటులోకి వస్తే దాదాపు ప్రతీ ఏటా రూ.460 కోట్ల ఆదాయం రైల్వేశాఖకు వచ్చే అవకాశముంటుందని తెలిపింది.

**ఆదాయం ఎంత ఆదాయమంటే..?**

ఇక ఏటా 12 మిలియన్ టన్నుల వరకు సరుకు రవాణా చేయవచ్చని. దీని ద్వారా ఆదాయం రూ.720 కోట్లకు పెరుగుతుందని అంచనా వేసింది. ఈ రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్రం ఎప్పుడో గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రైల్వేలశాఖ కూడా అలైన్‌మెంట్ సర్వే, డీపీఆర్ పనులు పూర్తి చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టు పనులపై కేంద్రానికి పలుమార్లు వినతులు పంపింది. త్వరగా పనులు మొదలుపెట్టాలని డిమాండ్ చేసింది. ఈ క్రమంలో త్వరలోనే పనులు మొదలుపెట్టేందుకు రైల్వేశాఖ సిద్ధమవుతోంది. ఈ నూతన కారిడార్ వల్ల సింగరేణి బొగ్గు గనుల రవాణాకు ప్రత్యక్ష కనెక్టివిటీ ఏర్పడనుంది. దీని వల్ల దాదాపు 150 కిలోమీటర్ల వరకు దూరం తగ్గుతుందని రైల్వేశాఖ చెబుతోంది. డీపీఆర్ ఇప్పటికే కేంద్రానికి సమర్పించగా.. త్వరలోనే ఆమెదం పొందే అవకాశముంది. అనంతరం ప్రాజెక్ట్ పట్టాలెక్కనుంది. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణలో రైల్వే మౌలిక సదుపాయాలు మెరుగుపడటమే కాకుండా రవాణా వ్యవస్థకు కూడా ఉతమిస్తుంది.

**పెరగనున్న కనెక్టివిటీ**

ప్రస్తుతం కొత్తగూడెం నుంచి రామగుండం మధ్య బొగ్గు రవాణాకు డొర్నకల్, వరంగల్, రామగుండం సెక్షన్ మార్గం ఉపయోగిస్తున్నారు. అయితే ఈ కొత్త రైల్వే లైన్ వల్ల 150 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. దీని వల్ల బొగ్గు రవాణాకు అయ్యే ఖర్చు కూడా భారీగా తగ్గుతుంది. మొత్తం ఐదేళ్ల వ్యవధిలో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. డీపీఆర్‌కు గ్రీన్ సిగ్నల్ వచ్చాక ఏడాదిలోగా భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయనున్నారు. ఇక సురుకు రవాణాతో పాటు ప్రయాణికులకు కూడా ఇది ఉపయోగపడనుంది. ఒడిశా, ఢిల్లీ, చత్తీస్ గఢ్ వైపు వెళ్లే రైళ్లు భద్రాద్రి కొత్తగూడెం మీదుగా ప్రయాణించవచ్చు. దీని వల్ల దూరం తగ్గనుంది.

## కిరాణా సామాన్ కోసం సూపర్ మార్కెట్ వెళ్తున్నారా.. ఇలా చేస్తే మీ బిల్ సగానికి సగం తగ్గుతుంది..



సూపర్‌మార్కెట్ ఆఫర్ల మాయలో పడి అనవసరంగా డబ్బులు వేస్ట్ చేస్తున్నారా? కొన్ని వస్తువులు వాడకుండా ఫ్రిజ్‌లోనే కుళ్లిపోతున్నాయా? అయితే మీ షాపింగ్ స్టైల్ మార్చాల్సిన టైమ్ వచ్చేసింది. ప్లానింగ్ లేకుండా చేసే షాపింగ్ వల్ల ఇటు ఆహారం వృథా అవ్వడమే కాకుండా, అటు నెలవారీ బడ్జెట్ కూడా తలకిందులవుతోంది. మీ జేబుకు చిల్లు పడకుండా ఇలా చేయండి.. మనలో చాలామందికి ఒక అలవాటు ఉంటుంది.. కేవలం రెండు వస్తువులు కొందామని సూపర్‌మార్కెట్‌కు వెళ్తాం.. కానీ తిరిగి వచ్చేటప్పుడు చేతిలో ఒక పెద్ద ట్రాలీ నిండా సామాన్లు ఉంటాయి. ఆఫర్లు చూసో, ముచ్చటపడో అవసరం లేని సాస్‌లు, కూరగాయలు కొనేసి.. ఆ తర్వాత వాటిని వాడటం మర్చిపోయి ఫ్రిజ్‌లోనే కుళ్లిపోయేలా చేస్తుంటాం. ఐక్యరాజ్యసమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా ఏటా దాదాపు 130 కోట్ల టన్నుల ఆహారం ఇలాగే వృథా అవుతోంది. ఈ వృథాను అరికడుతూనే, మీ బడ్జెట్ దాటకుండా స్మార్ట్‌గా గ్రోసరీ షాపింగ్ చేయడానికి ఉపయోగపడే 7 అద్భుతమైన టిప్స్ ఇవే..

**లిస్ట్ తయారు చేసుకోండి**

చాలామందికి లిస్ట్‌లు రాయడం బోర్ కొట్టే విషయమే, కానీ ఇది వృథా ఖర్చులను ఆపడంలో ఒక మ్యాజిక్‌లా పనిచేస్తుంది. ఇంట్లో ఏమేం వస్తువులు అయిపోవచ్చాయో ఒక నోట్‌పాడ్‌లో రాసుకోండి. వీలైతే త్వరగా పాడైపోయేవి, ఎక్కువ రోజులు నిల్వ ఉండేవి విడివిడిగా లిస్ట్ రాసి, షాపింగ్‌కు వెళ్లినప్పుడు ఆ లిస్ట్‌కు మాత్రమే కట్టుబడి ఉండండి.

**ఆఫర్ల మాయలో పడకండి**

డిస్కౌంట్ వస్తోంది కదా అని ఒకేసారి ఆరు సబ్బులు లేదా ఐదు కిలోల పిండి అవసరమా? అని ఆలోచించండి. ఆఫర్ల కోసం కొనేసి, ఆ తర్వాత వాడకుండా పక్కన పడేస్తే డబ్బుతో పాటు వస్తువు కూడా వేస్ట్. కూరగాయలు, పండ్లను వారానికి ఒకసారి.. డ్రై ప్రొడక్ట్స్, పప్పు దినుసులను నెలకు ఒకసారి మాత్రమే అవసరమైన మేర కొనుగోలు చేయండి.

**నిల్వ ఉంచే నియమాలు పాటించండి**

ప్రతి వస్తువు ప్యాకింగ్‌పై దాన్ని ఎలా నిల్వ చేయాలో రాసి ఉంటుంది. ఆ సూచనలను ఖచ్చితంగా పాటించండి. ఉదాహరణకు.. బ్రెడ్ ఎక్కువ రోజులు బయట ఉంటే పాడవుతుంది. ఇంట్లో తినేవారు తక్కువ మంది ఉంటే చిన్న బ్రెడ్ ప్యాకెట్ కొనండి. మిగిలితే ఒకటి లేదా రెండు రోజులు ఫ్రిజ్‌లో పెట్టి, తినే ముందు టోస్టర్‌లో వేడి చేసుకోండి.

**కొత్త వస్తువులైతే చిన్న శాంపిల్స్ కొనండి**

మార్కెట్లోకి కొత్తగా వచ్చిన చీజ్, సాస్‌లు లేదా కొత్త బ్రాండ్ ప్రొడక్ట్స్‌ను ట్రై చేయాలనుకుంటే.. మొదట అందులో దొరికే అత్యంత చిన్న సైజ్ ప్యాకెట్‌ను మాత్రమే కొనండి. అది మీకు నచ్చి, మీ డైట్‌కు సెట్ అవుతుందనుకుంటేనే తర్వాత పెద్ద ప్యాకెట్ కొనడం వల్ల అనవసరపు ఖర్చులు తగ్గుతాయి.

**మంచి డీల్స్ ఎంచుకోండి**

మనం రెగ్యులర్‌గా వాడే మసాలాలు, తృణధాన్యాలు, ఫ్లోర్ క్లీనర్స్ వంటి వస్తువులపై బై వన్ గెట్ వన్ ఆఫర్లు ఉన్నప్పుడు కొనుగోలు చేయడం మంచి పద్ధతి.

## చిట్టీలు వేస్తున్నారా..? ఇలా చేస్తే మీకు లాభమే లాభమే చాలామందికి తెలియని విషయమిదే..



ఇటీవల చిట్ ఫండ్స్‌లో ఎక్కువమంది పెట్టుబడులు పెడుతున్నారు. గ్రామాల నుంచి నగరాల వరకు ఎన్నో చిట్టీ గ్రూపులు నడుస్తున్నాయి. అయితే కొంతమందికి వీటిపై తప్పుడు అభిప్రాయం ఉంది. మోసాలు ఎక్కువగా చోటుచేసుకుంటుండటంతో పొదుపు చేయాలంటేనే భయపడిపోతారు. కానీ వీటి వల్ల లాభాలు కూడా ఉన్నాయి. నగరాల నుంచి గ్రామాల వరకు.. ఎక్కడబట్టినా చిట్టీల గురించి మీరు వినే ఉంటారు. ఇటీవల ఆన్‌లైన్‌లో చిట్టీలు వేసే విధంగా అనేక డిజిటల్ ఫ్లాట్‌ఫామ్స్ కూడా వచ్చాయి. ఫ్రెండ్స్, కుటుంబసభ్యులు, సన్నిహితులు ఒక సుమూహంగా ఏర్పడి చిట్టీలు వేస్తూ ఉంటారు. ఇదే కాకుండా అనేక చిట్ ఫండ్ కంపెనీలు కూడా పుట్టుకొస్తున్నాయి. నెలనెలా చిన్న మొత్తంలో డబ్బులు పొదుపు చేసుకునేందుకు చాలామంది చిట్టీలలో చేరుతూ ఉంటారు. ఇక మరికొంతమంది అవసరానికి డబ్బులు ఒకేసారి సమకూరుతాయనే ఉద్దేశంతో వీటిల్లో చేరతారు. ఇటీవల చిట్టీల ద్వారా డబ్బులు పొదుపు చేసేవారు, అలాగే డబ్బును లోన్ రూపంలో తీసుకునే లావాదేవీలు ఎక్కువగా జరుగుతున్నాయి. చిట్టీలపై చాలామందికి అనేక అనుమానాలు ఉంటున్నాయి. కొంతమంది చిట్టీల రూపంలో డబ్బులు కలెక్ట్ చేసిన తర్వాత కనిపించకుండా పోతున్నారు. ఇలాంటి మోసాల వల్ల చిట్టీలపై ప్రజల్లో చాలా భయాలున్నాయి. అసలు చిట్టీల వల్ల లాభాలేంటి..? నష్టాలేంటి..? వీటిల్లో చేరడం మంచిదేనా? అనే విషయాలు ఇప్పుడు చూద్దాం.

**చిట్ ఫండ్స్ అంటే ఏంటి..?**

కొంతమంది ఒక గ్రూపుగా కలిసి నిర్వహించేదే చిట్ ఫండ్. గ్రూపు సభ్యులందరూ జమ చేయగా వచ్చిన డబ్బును గ్రూపులోని ఒక వ్యక్తిగా లోన్ రూపంలో అందిస్తారు. ముందుగానే ఎవరు తీసుకోవాలనేది ఫిక్స్ అవుతారు. ఎక్కువ పోటీ ఉంటే బిడ్డింగ్ నిర్వహిస్తారు. లోన్ తీసుకున్న వ్యక్తి తర్వాతి నెల నుంచి వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. చివరి వరకు చిట్టీలో కొనసాగినవారికి వడ్డీ రూపంలో అదనంగా డబ్బు లభిస్తుంది. మొదట్లో డబ్బులు తీసుకునేవారు అదనంగా కట్టాల్సి రావడం వల్ల నష్టం జరుగుతుంది. అదే చివరి వరకు ఉండేవారికి లాభమే. కానీ డబ్బులు అత్యవసరం కావడంతో చాలామంది మధ్యలోనే లోన్ రూపంలో తీసుకుంటారు. ఇలాంటి వారికి నష్టమేనని చెప్పవచ్చు. కానీ అత్యవసంర కావడంతో డబ్బులు తీసుకుంటారు. బ్యాంకుల్లో లోన్ తీసుకోవాలంటే సిబిల్ స్కోర్, డాక్యుమెంటేషన్ ప్రాసెస్ ఉంటుంది. అదే చిట్ ఫండ్స్‌లో అలాంటి ఏమీ ఉండవు.

**లాభాలు ఇవే..**

అత్యవసరమైన సమయంలో డబ్బు వెంటనే చేతికి అందుతుంది

బయట తీసుకునే లోన్లతో పోలిస్తే చిట్టీలలో వడ్డీ చాలా తక్కువగా ఉంటుంది

నెలనెలా డబ్బులు చిన్న మొత్తాల్లో పొదుపు చేసుకోవచ్చు

ఎలాంటి డాక్యుమెంటేషన్ ఉండదు

నష్టాలు ఏంటంటే..?


గ్రూపులోని సభ్యుడు డబ్బులు కట్టకపోతే అందరిపై ప్రభావం పడుతుంది

అనధికార, రిజిస్టర్ కాని సంస్థల వల్ల చిట్టీ వేస్తే మోసపోయే అవకాశముంటుంది


మధ్యలో డబ్బులు తీసుకుంటే తర్వాతి నెల నుంచి అదనంగా వడ్డీ చెల్లించాలి

## నో వెయిటింగ్ సెకన్లలోనే రైల్వే టికెట్ బుక్ చేసుకోవచ్చు రైల్వేశాఖ నుంచి కీలక అప్డేట్..








ప్రస్తుతం ఆన్‌లైన్‌లో రైల్వే టికెట్లను బుక్ చేసుకోవాలంటే రిజర్వేషన్ సిస్టమ్ చాలా స్లోగా ఉంటుంది. కానీ త్వరలో కొత్త సిస్టమ్ రానుంది. ఈ మేరకు రైల్వేశాఖ అభివృద్ధి చేస్తోంది. దీని వల్ల రైల్వే టికెట్లు అత్యంత వేగంగా బుక్ అవుతాయి. సిస్టమ్ క్రాష్ వంటి సమస్యలు ఉండవు.

**1 / 5**

అయితే ఇప్పుడు కొత్త వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నారు. గతంలో పోలిస్తే ఇప్పుడు ప్రయాణికుల సంఖ్య పెరిగింది. ఆన్‌లైన్‌లో టికెట్లను బుక్ చేసుకునేవారు కూడా ఎక్కువైపోయారు. డిమాండ్‌కు తగ్గట్లు ప్రస్తుత రిజర్వేషన్ సిస్టమ్ లేదు. దీంతో ప్రయాణికులందరూ ఒకేసారి టికెట్లు బుక్ చేసుకునే సమయంలో సాంకేతిక సమస్యలు వస్తున్నాయి. వెబ్ సైట్ క్రాష్ అవ్వడం, నెమ్మదించడం లాంటివి చోటుచేసుకుంటున్నాయి.

**2 / 5**

ఈ క్రమంలో ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా కొత్త వ్యవస్థను అప్‌గ్రేడ్ చేస్తున్నారు. కొత్త సిస్టమ్‌లో ఎలాంటి సర్వర్ సమస్యలు ఉండవు. నిమిషాల వ్యవధిలోనే వేగంగా టికెట్లను బుక్ చేసుకోవచ్చు. లక్షలాది మంది ఒకేసారి బుక్ చేసుకునే సామర్థ్యంతో వ్యవస్థను రూపొందిస్తున్నారు. 2002లో రైల్వేశాఖ ఆన్‌లైన్‌లో టికెట్లను బుక్ చేసుకునే విధానం ప్రారంభించింది. అప్పటినుంచి ఆన్‌లైన్‌లో టికెట్లను బుక్ చేసుకునేవారు పెరిగిపోయారు.

**3 / 5**

ప్రస్తుతం ఎక్కువమంది ఆన్‌లైన్‌లోనే టికెట్లను బుక్ చేసుకుంటున్నారు. రైల్వే టికెట్లలో 88 శాతం బుకింగ్స్ కేవలం ఆన్ లైన్ ద్వారానే జరుగుతున్నాయి. దీంతో ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్ వ్యవస్థలో కొన్ని లోపాల వల్ల సర్వర్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు పాత వ్యవస్థ స్థానంలో కొత్త రిజర్వేషన్ సిస్టమ్ ప్రవేశపెడుతున్నారు.


**4 / 5**


ఇటీవల రిజర్వేషన్ వ్యవస్థలో ఏఐ టూల్స్‌ను కూడా రైల్వేశాఖ ప్రవేశపెట్టింది. దీని వల్ల వెయిటింగ్ టికెట్లు కన్ఫార్మ్ అవుతాయా.. లేదా అనేది ప్రయాణికులు ముందుగానే తెలుసుకోవచ్చు. ఏఐ వ్యవస్థ ఖచ్చితమైన అంచనాతో సమాచారం అందిస్తుంది. గతంలో 53 శాతం ఖచ్చితత్వం ఉండగా.. ఇప్పుడు 94 శాతానికి చేరుకుంది.

## ట్రైన్ టికెట్లపై చిన్న రంధ్రాలు ఎందుకుంటాయి..? హవ్వా అసలు సీక్రెట్ ఇదా..







మీరు పాత రోజుల్లో ట్రైన్ టికెట్ చూస్తే.. టికెట్‌పై రెండు వైపులా చిన్న చిన్న రంధ్రాలు ఉంటాయి. అయితే కాగితంపై ఈ రెండు రంధ్రాలు ఎందుకు అనే డౌట్ ప్రతీఒక్కరికీ వచ్చే ఉంటుంది. అయితే ఈ రంధ్రాల వెనుక పెద్ద కారణమే ఉందట.

ప్రతీఒక్కరూ ఎప్పుడో ఒకసారి రైళ్లల్లో ప్రయాణం చేసి ఉంటారు. కౌంటర్ దగ్గరకు వెళ్లి లైన్లో నిల్చోని టికెట్ తీసుకుని ఉండి ఉంటారు. అయితే ట్రైన్ టికెట్‌కి సంబంధించి చాలా ఆసక్తికర విషయాలు ఉన్నాయి. టికెట్‌పై ఛార్జీ, ఎక్కడ నుంచి ఎక్కడి వరకు అనేవి ముద్రించి ఉంటాయి. అయితే పాత రోజుల్లో టికెట్‌కు రెండు వైపులా చివరిలో చిన్న రంధ్రాలు ఉండేవి. అసలు ఆ రంధ్రాలు ఎందుకు ఉన్నాయి? అనే అనుమానం చాలామందికి వచ్చి ఉంటుంది. దానికి సమాధానాలు ఇప్పుడు చూద్దాం

**1 / 5**

రైలు టికెట్‌పై ఉండే చిన్న రంధ్రాలను చూసి అలంకరణ కోసమో లేదా ఆకర్షణీయమైన డిజైన్ కోసం అని చాలామంది అనుకుంటారు. కానీ దీని వెనుక పెద్ద సీక్రెట్ ఉంది. ఒక పెద్ద సాంకేతిక కారణం ఉంది. పాత రోజుల్లో టెక్నాలజీ, కంప్యూటర్లు, ప్రింటర్లు అంతగా అందుబాటులో ఉండేవి కాదు. దీంతో రైలు టికెట్లను ముద్రించేందుకు ప్రత్యేక యంత్రాలను ఉపయోగించేవారు. ఈ యంత్రాల కారణంగానే ఈ చిన్న రంధ్రాలు అవసరమయ్యాయి.

**2 / 5**

వీటిని స్ప్రోకెట్ రంధ్రాలుగా పిలుస్తారు. అప్పట్లో డాట్ మ్యాట్రిక్స్ ప్రింటర్లను రైల్వేశాఖ ఉపయోగించేది. టికెట్ల జారీ కోసం వీటిని అభివృద్ధి చేశారు. పాత రోజుల్లో టికెట్లను వేర్వేరు పేజీలుగా కాకుండా పొడవైన కాగితంపై ముద్రించేవారు. ప్రింటర్ కాగితాన్ని సరిగ్గా పట్టుకుని ముందుకు కదిలించడానికి వీలుగా ఇరువైపులా రంధ్రాలను కాగితానికి సమాన దూరంలో ఉంచేవారు.

**3 / 5**

పాత డాట్ మ్యాట్రిక్స్ ప్రింటర్లు పూర్తిగా యాంత్రికమైనవి. వాటి లోపల చిన్న పళ్ళ చక్రాలు ఉండేవి. ఈ చక్రాలు కాగితం అంచులలోని రంధ్రాలలోకి సరిపోయి కాగితాన్ని ముందుకు లాగేవి. ఈ చిన్న రంధ్రాలు లేకపోతే కాగితం జారిపోయి వంకరగా అయ్యేది. అలా జరిగితే టికెట్‌పై ముద్రించిన సమాచారం సరైన స్థానంలో కాకుండా తప్పుగా ఉండేది. స్ప్రాకెట్ రంధ్రాల కారణంగా కాగితం సరళ రేఖలో కదలడమే కాకుండా ప్రతి టికెట్ సరిగ్గా ముద్రించబడేది.

**4 / 5**

అయితే ప్రస్తుతం ఆధునిక థర్మల్, డిజిటల్ ప్రింటర్లు అందుబాటులోకి వచ్చాయి. కొత్త ప్రింటర్లకు కాగితాన్ని కదిలించేందుకు గేర్‌వీల్ వ్యవస్థ అవసరం లేదు.

Ho no:LIG-32,, Ph No:- 9247842354, 9059207979,near water tank, Bharat Nagar colony, moos-apet, Hyderabad, pin code 500018.